సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం । 11 । డిసెంబర్ । 2024



ఆకట్టుకుంటున్న కొత్తపల్లి జలపాతం ప్రవేశ ద్వారం


ప్రత్యేక ఆకర్షణగా 'ఐ లవ్ కొత్తపల్లి వాటర్‌పాల్స్' నమూనా

'కొత్తపల్లి' జిగేల్

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాత పరిసరాలను సుందరీకరణ పనుల్లో భాగంగా ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్నారు. వీటిపై పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ప్రత్యేకదృష్టి సారించారు. జలపాతం వద్దకు వెళ్లే మార్గంలో ప్రవేశద్వారం, 'ఐ లవ్ కొత్తపల్లి వాటర్‌ఫాల్స్' నమూనా, వ్యూపాయింట్‌తో కొత్త శోభ నెలకొంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి కాఫీ గింజల కొనుగోలు


బంగారుమెట్టలో పార్చ్‌మెంట్ కాఫీ గింజల్లో తేమశాతాన్ని పరిశీలిస్తున్న జీసీసీ సిబ్బంది

సాక్షి,పాడేరు: గిరిజన రైతులు **ఉత్పత్తి చేస్తున్న** కాఫీ గింజలను బుధవారం **నుంచి కొనుగోలు**కు గిరిజన సహకార సంస్థ **ఏర్పాట్లు చేస్తోంది.** దీనిలో భాగంగా పాడేరు మం**డలం దొడ్డిపల్లిలో** కాఫీ గింజల కొనుగోలును ప్రా**రంభించనుంది.** ఈ మేరకు మండలంలోని పాత**పాడేరు, బంగా**రుమెట్ట, దొడ్డిపల్లి గ్రామాల్లో **గిరిజన రైతులు** అమ్మకానికి సిద్ధం చేసిన పార్చ్‌**మెంట్ కాఫీ గిం**జల్లో తేమశాతాన్ని మంగళవార**ం జీసీసీ సిబ్బం**ది పరిశీలన చేశారు. ఈఏడాది పార్చ్‌మెంట్ కాఫీ గింజలు కిలో రూ.285, అరాబిక చెర్రీ రకం కిలో రూ.150, రొబస్టా చెర్రీ కిలో రూ.80 చొప్పున కొనుగోలు చేస్తామని ఇప్పటికే జీసీసీ ప్రకటించడం తెలిసిందే.

ఉద్యోగ భద్రత కల్పించాలని ఆదివాసీల దీక్షలు


దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఎటపాక: షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ డిమాండ్ చేసింది. దీనిలో భాగంగా మంగళవారం నెల్లిపాకలో 48 గంటలు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా దీక్షలు ప్రారంభించిన పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బంగారు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో ఆర్టికల్ 24(1)లో మార్పులు చేసి ఉపాధ్యాయ పోస్టులతో పాటు అన్ని శాఖల ఉద్యోగాలు ఆదివాసీ యువతతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలోని చట్టాలు సక్రమంగా అమలు చేయడంలో విఫలమవుతున్నారని ,గురుకులాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనం ఇవ్వాలన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులు ఉమ్మల దుర్గారెడ్డి, సురేష్, వెంకటేష్, లక్ష్మయ్య, వినోద్, కుర్సం రాజశేఖర్, తెల్లం నవీన్, ముదిరాజు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల సందర్శన


మందుల వివరాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

ఎటపాక: మండలంలోని నెల్లిపాక, లక్ష్మీపురం పీహెచ్‌సీలను మంగళవారం డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రోగులకు అందుతున్న సేవలు, వసతులను పరిశీలించారు. మందుల వివరాలను వైద్యాధికారుల నుంచి తెలుసుకున్నారు. వ్యాక్సిన్ నిల్వలను పరిశీలించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, వైద్యాధికారి ప్రత్యూష పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలు సద్వినియోగం చేసుకోండి

- అంధత్వ నివారణ సంస్థ జిల్లా అధికారి విశ్వేశ్వరనాయుడు


పీహెచ్‌సీలో కంటిని పరీక్షిస్తున్న వైద్యాధికారి

హుకుంపేట: ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిర్వహించే ఉచిత కంటి వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని అంధత్వ నివారణ సంస్థ జిల్లా అధికారి డా. తమర్బ విశ్వేశ్వర నాయుడు కోరారు. మంగళవారం ఆయన స్థానిక పీహెచ్‌సీ, ఉప్ప పీహెచ్‌సీలో అంధత్వ నివారణ సంస్థ, శంకర్ ఫౌండేషన్ (విశఖ) నిర్వహించిన కంటి వైద్యశిబిరంలో ఆయన పాల్గొన్నారు. కంటి పరీక్షలను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. కంటి పరీక్షల్లో గుర్తించిన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తామన్నారు. వైద్యశిబిరంలో 152 మందిని పరీక్షించారు. హుకుంపేట పీహెచ్‌లో 31, ఉప్ప పీహెచ్‌సీలో-11 మందిని శస్త్రచికిత్స నిమిత్తం విశాఖలోని శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఫౌండేషన్ కంటి వైద్య నిపుణులు డాక్టర్ అప్పారావు, స్థానిక వైద్యాధికారులు డా. మోహన్‌సాయిరెడ్డి, డా.సౌజన్య పాల్గొన్నారు.

గత రెండేళ్లుగా వాతావరణ పరిస్థితులు అనుకూలించక నష్టపోయిన స్ట్రాబెర్రీ రైతులకు ఈ ఏడాది పరిస్థితులు అనుకూలించాయి. దిగుబడి ఆశాజనకంగా ఉండటంతో అన్నిఖర్చులు పోనూ ఎకరాకు రూ.2 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందని రైతులు పేర్కొన్నారు. **సేంద్రియ విధానంలో పండించడం వల్ల కొనుగోలు చేసేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు.**

లాభాల సిరి స్ట్రాబెర్రీ



- అరకు, లంబసింగిలో 15 ఎకరాల్లో సాగు
- గత రెండేళ్లుగా నష్టాలు
- ఈ ఏడాది మంచి దిగుబడి
- ఎకరాకు రూ.2 లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం


అరకులోయలోని బల్లుగుడ సమీపంలో సాగవుతున్న స్ట్రాబెర్రీ


రాజుపాకలులో కౌలు రైతు సత్యనారాయణ వద్ద పండ్లను కొనుగోలు చేస్తున్న పర్యాటకులు

సాక్షి,పాడేరు: మన్యంలో స్ట్రాబెర్రీ పండ్ల సీజన్ ప్రారంభమైంది. పర్యాటక సీజన్ కావడంతో మంచి ఆదరణ నెలకొంది. అరకులోయ, లంబసింగి ప్రాంతాల్లో 15 ఎకరాల విస్తీర్ణంలో ఈ పంటను సాగు చేస్తున్నారు. కొంతమంది మైదాన ప్రాంత రైతులు గిరిజనుల వద్ద భూములు లీజుకు తీసుకుని చింతపల్లి మండలం లంబసింగి ప్రాంతంలో పండిస్తున్నారు. అరకులోయలోని పెదబల్లుగుడ సమీపంలో ఎకరా విస్తీర్ణంలో గిరిజన రైతులే స్వయంగా స్ట్రాబెర్రీని పండిస్తున్నారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో పండ్ల దిగుబడి ఆశాజనకంగా ఉంది. అరకులోయ, లంబసింగి, రాజుపాకల ప్రాంతాల్లో స్ట్రాబెర్రీ పండ్ల అమ్మకాలు జోరందుకున్నాయి. ఈ ప్రాంతానికి వచ్చే పర్యాటకులు నేరుగా రైతుల వద్దకు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. ఎరువులు, క్రిమిసంహారక మందులు వినియోగించకుండా పండించడం వల్ల పండ్లకు మంచి డిమాండ్ ఉంది.


200 గ్రాములు రూ.100

అరకులోయ, లంబసింగి ప్రాంతాల్లో రైతులు, వ్యాపారులు 200 గ్రాముల పండ్లను రూ.100కు విక్రయిస్తున్నారు. మైదాన ప్రాంతాల్లో పండ్ల వ్యాపారులకు వారు ఇదే పండ్లను రూ.90కు అమ్ముతున్నారు. విశాఖపట్నం, విజయనగరం, రాజమండ్రి, విజయవాడ ప్రాంతాలకు లంబసింగి ప్రాంతం నుంచి ప్రతిరోజు ఎగుమతి అవుతోంది.

ఎకరానికి రూ.2లక్షల ఆదాయం

ఎకరాకు మూడు వేల కిలోల వరకు దిగుబడి వస్తోందని రైతులు తెలిపారు. అన్ని ఖర్చులు పోను ఎకరాకు రూ.2 లక్షల వరకు ఆదాయం వస్తుందని వారు వివరించారు. ఈ ఏడాది పంట ఆశాజనకంగా ఉందని రాజుపాకలు ప్రాంతానికి చెందిన రైతు సత్యనారాయణ తెలిపారు.

అనుకూలించిన వాతావరణం



స్ట్రాబెర్రీ సాగుకు ఈఏడాది వాతావరణం అనుకూలంగా ఉంది. గత రెండేళ్ల అధిక వర్షాల కారణంగా పంటకు నష్టం వాటిల్లింది. ఈసారి మాత్రం పూత బాగుంది. పండ్ల సైజు కూడా పెద్దదిగా ఉండడంతో మరింత ఇష్టంగా తింటున్నారు. గిరిజన రైతులు సాగు చేపట్టేందుకు ముందుకు వస్తే ప్రోత్సహిస్తాం. హెక్టార్‌కు రూ.50వేల వరకు ఆర్థిక ప్రోత్సాహాన్ని ప్రభుత్వం అందజేస్తోంది.

– రమేష్‌కుమార్‌రావు, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి, పాడేరు

రైతులను ఆదుకోవడంలో 'కూటమి' విఫలం

- ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం
- 13న జిల్లా కేంద్రంలో అన్నదాతకు అండగా కార్యక్రమం
- ఆందోళనకు తరలిరావాలని పిలుపు


అన్నదాతకు అండగా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం, ఎమ్మెల్సీ రవిబాబు

అరకులోయ టౌన్: గిరి రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం విమర్శించారు. మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడుస్తున్నా ఎన్నికల హామీలు నెరవేర్చలేదని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రైతు సమస్యలపై అన్నదాతకు అండగా కార్యక్రమంలో భాగంగా ఈనెల 13న కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. విద్యుత్ ట్రూ అప్ చార్జీలు పెంచడంపై ఈనెల 27న, విద్యార్థులకు సంబంధించి అమ్మ ఒడి, ఫీజు రియింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంపై వచ్చే నెల 3న పెద్ద ఎత్తున అందోళన చేపడుతున్నట్టు వెల్లడించారు. గత ఐదేళ్లలో జగన్‌మోహన్‌రెడ్డి రైతుల ఖాతాల్లో ఏటా రూ. 13,500 పెట్టుబడి సాయం జమచేశారన్నారు. అంతకు మించి ఏటా రూ.20 వేలు జమచేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా రైతులను మోసగించారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుతచార్జీలు తగ్గిస్తామన్న కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో రెండు సార్లు పెంచి ప్రజలపై రూ.15,454 కోట్లు భారం వేసిందన్నారు. అంతేకాకుండా యూనిట్‌కు రూ. 2.16 పైసలు పెంచిందన్నారు. ట్రూఅఫ్ చార్జీలు మొత్తం ప్రభుత్వమే భరించాలని వారు డిమాండ్ చేశారు. గిరిజన రైతులు సాగు చేసే భూములకు అధికారం చేపట్టిన ఆరు నెలల్లో పట్టాలు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. వాణిజ్య పంటలు, కూరగాయలకు గిట్టుబాటు ధరలు కల్పించడం లేదన్నారు. ఈ ఏడాది ధాన్యం, చిరుధాన్యాల పంటలకు నష్టం జరిగినా పరిహారం ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. అన్నదాతకు అండగా కార్యక్రమం పోస్టర్‌ను వారు విడుదల చేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పాంగి చిన్నారావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జన్ని నర్సింహమూర్తి, పార్లమెంట్ నాయకుడు కమిడి అశోక్, ఎంపీటీసీ శత్రుఘ్న తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా ఉంటాం

- మేలు జరిగే వరకు వారి వెంటే..
- వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి


జి.మాడుగులలో పార్టీ నేతలతో మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

జి.మాడుగుల: కూటమి ప్రభుత్వం దగాకు గురైన అన్నదాతకు అన్నివిధాలుగా వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని ఆపార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె జి.మాడుగులలో ఎంపీటీసీ, సర్పంచ్‌లు, పార్టీ ముఖ్యనేతలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్నదాతకు అండగా ఉంటామన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు తీరని అన్యాయం చేస్తోందని, వారికి మేలు జరిగేంత వరకు పార్టీ అండగా ఉంటుందన్నారు. దీనిపై కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు ఈనెల 13న రైతులతో ఉద్యమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కన్వీనర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. పాడేరు మార్కెట్ కమిటీ మాజీ ఛైర్‌పర్సన్ మత్స్యరాస గాయత్రి, ఎంపీటీసీలు మత్స్యరాస విజయకుమారి, గబ్బాడి సన్యాసిదొర, చిన్నారావు, పాంగి లక్ష్మి, జేసీఎస్ ఇన్‌చార్జి ఎల్.కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

లొంగిపోయిన మావోయిస్టులకు ఉపాధి అవకాశాలు

- సరళ్ కార్యక్రమంలో నైపుణ్య శిక్షణ
- లీడ్ బ్యాంక్ సహకారంతో రుణాలు
- ఎస్పీ అమిత్ బర్దర్


సరళ్ కార్యక్రమానికి హాజరైన ఎస్పీ అమిత్‌బర్దర్, జేసీ అభిషేక్ గౌడ్, ఐటీడీఏ పీవో అభిషేక్


హాజరైన మాజీ మావోయిస్టు, మిలీషియా సభ్యులు

పాడేరు : స్వచ్ఛందంగా లొంగిపోయిన మావోయిస్టులు, మిలీషియా సభ్యులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ అమిత్‌బర్దర్ అన్నారు. పాడేరు ఐటీడీఏ పరిధిలోని 11 మండలాల్లో లొంగిపోయిన మావోయిస్టులు, మిలీషియా సభ్యులకు ఎస్పీ ఆధ్వర్యంలో సరళ్ (సులభతర వ్యాపారానికి-నైపుణ్య శిక్షణ) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఏజెన్సీలో గత పదేళ్లలో పరిస్థితులు వేరని ఇప్పుడున్న పరిస్థితులు వేరన్నారు. గతంలో మావోయిస్టు పార్టీలకు ఆకర్షితులై ఆ పార్టీలో చేరి సాటి గిరిజనులనే హత్య చేసిన సంఘటనలు ఉన్నాయన్నారు. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా లొంగిపోయారన్నారు. వారికి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతోనే ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. లొంగిపోయిన వారికి వారు ఎంచుకున్న రంగాల్లో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చి లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో రుణాలు మంజూరు చేస్తామన్నారు. ఏజెన్సీలో ప్రతి ఒక్కరు నిషేధిత గంజాయికి దూరంగా ఉండి ప్రశాంత జీవనం గడపాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్ మాట్లాడుతూ లొంగిపోయిన మావోయిస్టులు, మిలీషియా సభ్యుల భవిష్యత్‌పై పోలీసులు చేసున్న ప్రయత్నం గొప్ప విషయమన్నారు. ప్రతి ఒక్కరు వారి సామర్థ్యం మేరకు ఆసక్తి ఉన్న రంగాలను ఎంచుకోవాలన్నారు. ఏజెన్సీలో పర్యాటక రంగం బాగా వృద్ధి చెందుతోందని, అటువంటి రంగాలపై దృష్టి సారించాలన్నారు. ప్రతి ఒక్కరు సరళ్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐటీడీఏ పీవో అభిషేక్ మాట్లాడుతూ గతంలో అల్లూరి జిల్లా అంటే గంజాయి, అహింసా వంటివి ఉండేవని కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేవన్నారు. ఇప్పుడు కాఫీ, మిరియాలు, రాజ్‌మా, పసుపు వంటి వాణిజ్య పంటలు, శాంతి గుర్తుకొస్తుందన్నారు. ఇందుకు ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలే ఇందుకు ఉదాహరణ అన్నారు. ఎన్నికలు గతంలో ఎన్నడూ లేనంత ప్రశాంతంగా జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు డీఎస్పీ ప్రమోద్, జిల్లా నైపుణాభివృద్ధి సంస్థ అధికారి రోహిణి, లీడ్ బ్యాంకు మేనేజర్ నాయుడు, సీఐలు దీనబంధు, సన్యాసినాయుడు, ఎస్‌బీ సీఐ అప్పలనాయుడు పాల్గొన్నారు.

నిరుద్యోగ గిరిజన యువతకు రుణాలు

ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు


సమీక్ష నిర్వహిస్తున్న ట్రైకార్ ఛైర్మన్ శ్రీనివాసులు

పాడేరు : ట్రైకార్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అర్హులైన నిరుద్యోగ గిరిజన యువతకు రూ.7కోట్లతో 54 యూనిట్ల ఎన్‌ఎస్‌టీఎఫ్‌డీసీ రుణాలను మంజూరుకు ప్రతిపాదనలు పంపించామనిట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు వెల్లడించారు. మంగళవారం ఆయన స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన యువతకు బొలేరా, ఇన్నోవా, స్విఫ్ట్ వాహనాలకు రుణాలు అందజేస్తామన్నారు. 60 శాతం సబ్సిడీపై స్వయం ఉపాధి పథకాలు మంజూరుకు చర్యలు చేపట్టామన్నారు. ఐటీడీఏ ఏపీవో ఎం.వెంకటేశ్వరరావు ఐటీడీఏ పరిధిలో అమలు చేస్తున్న కాఫీ, వీడీవీకేలు, గోకుల షెడ్ల నిర్మాణాలు, వన్ వికాస్ కేంద్రాల్లో ఉత్పత్తులపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ట్రైకార్ ఛైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ అభిషేక్ గౌడ, ఐటీడీఏ పీవో అభిషేక్ మర్యాద పూర్వకంగా కలిశారు. అంతకు ముందు ఆయన మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. రాష్ట్ర ట్రైకార్ డైరెక్టర్లు కూడా కృష్ణారావు, ఎస్. లావణ్య, అనురాధ, జీసీసీ డైరెక్టర్లు బొర్రా నాగరాజు, పాంగి రాజారావు, ఈఈలు వేణుగోపాల్, డేవిడ్‌రాజు, జనహర్‌కుమార్, ఐటీడీఏ ఏవో హేమలత పాల్గొన్నారు.

'ఏకలవ్య' ల్యాబ్ అసిస్టెంట్, ప్రిన్సిపాల్ సస్పెన్షన్


- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్
- బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన ఘటనలో చర్యలు
- పాడేరు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల తనిఖీ


ఏకలవ్య పాఠశాలలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు : ఏడో తరగతి చదువుతున్న బాలికపై ఇటీవల అఘాయిత్యానికి పాల్పడిన ల్యాబ్ అసిస్టెంట్ అనూజ్ సింగ్ పటేల్, పాఠశాల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్ సీహెచ్ ప్రభాకర్‌రావును కూడా సస్పెండ్ చేసినట్టు పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. మంగళవారం ఆయన పాడేరు ఏకలవ్య మోడ్రన్ రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ బాలికల విద్యాలయాల్లో ఎవరైనా అఘాయిత్యాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బోధన, బోధనేతర సిబ్బందితో సమావేశమయ్యారు. పాఠశాలలో గిరిజన విద్యార్థినిపై ఈనెల 2న అఘాయిత్యం జరిగితే 5వ తేదీ వరకు అధికారుల దృష్టికి ఎందుకు తీసుకురాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల ల్యాబ్ అసిస్టెంట్ పాఠశాల విద్యార్థినులపై అఘాయిత్యానికి పాల్పడినట్లు సబ్ కలెక్టర్ కార్యాలయ ఉద్యోగి ద్వారా విషయం తెలుసుకున్న సబ్ కలెక్టర్ విచారణ చేశారన్నారు. కలెక్టర్, ఎస్పీతో చర్చించి బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన అనూజ్ సింగ్ పటేల్‌పై పోక్సో కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామన్నారు. ఈ సంఘటనపై జిల్లా గిరిజన సంక్షేమాశాఖాధికారి నేతృత్వంలో ఐసీడీఎస్ అధికారుల తో కమిటీ వేశామన్నారు. బాధిత బాలికకు పూర్తి స్థాయి వైద్య పరీక్షలు నిర్వహించి అబ్జర్వేషన్‌లో ఉంచినట్టు తెలిపారు. ఆమెకు అన్ని విధాల అండగా ఉంటామని వేరే ఏకలవ్య పాఠశాలలో చేరిస్తామన్నారు. ఇదే తరహాలో గతంలో బంధవీధి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో జరిగిన సంఘటనలో పోక్సో కేసు నమోదు చేసి జైలుకు పంపించడం జరిగిందన్నారు. బాలికలను వేధించినా, అసభ్యంగా ప్రవర్తించినా చట్ట పరంగా కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యు ఇన్‌చార్జి డీడీ రజనీ, గురుకులం ప్రిన్సిపాల్ మూర్తి, ఐసీడీఎస్ సీడీపీవో ఝాన్సీలక్ష్మి, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం రెవెన్యూ సదస్సులు

రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం


మాట్లాడుతున్న రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం, సబ్‌కలెక్టర్ కల్పశ్రీ


సమావేశానికి హాజరైన అధికారులు

రంపచోడవరం: ఏజెన్సీ ఏడు మండలాల్లో పరిధిలోని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో సబ్ కలెక్టర్ కల్పశ్రీతో కలిసి రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులు ద్వారా నిబంధనల ప్రకారం భూ సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఏజెన్సీ చట్టాల ద్వారా ఈ ప్రాంతంలోని గిరిజనులకు నిబంధనలు అనుసరించి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. రేషన్ కార్డుదారులకు ప్రతీ నెల రేషన్ సకాలంలో అందుతుందా, లేదా పరిశీలించాలని సూచించారు. దళారులు రేషన్ బియ్యం కొనుగోలు చేసినా, విక్రయించినా చర్యలు తప్ప వని హెచ్చరించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఏజెన్సీలో భూ సమస్యలు పరిష్కరించే విధంగా ఈ నెల 13 నుంచి వచ్చే ఏడాది జనవరి 8వ రెవెన్యూ సదస్సులు షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని సూచించారు. రెండు రోజులు ముందుగానే రెవెన్యూ సదస్సులు నిర్వహించే గ్రామాల్లో దండోరా వేయించాలని తెలిపారు.రెవెన్యూ సదస్సు వివరాలను బ్యాంకు మేనేజర్లకు తెలియజేయాలన్నారు. ప్రభుత్వ, రెవెన్యూ భూములకు సంబంధించిన వివరాలు సదస్సుల్లో ప్రదర్శించాలన్నారు. వచ్చిన దరఖాస్తులకు రశీదులు ఇవ్వాలన్నారు. తహసీల్దార్లు రామకృష్ణ, వేణుగోపాల్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి తక్షణ సాయం

రూ.3 లక్షల చెక్కును అందజేసిన జేసీ అభిషేక్ గౌడ, పీవో అభిషేక్


జిల్లా ఆస్పత్రి మార్చురీలో తల్లీబిడ్డల మృతదేహాలను పరిశీలిస్తున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం


మోహన్‌రావుకు రూ.3 లక్షల చెక్కు అందజేస్తున్న జేసీ అభిషేక్ గౌడ, ఐటీడీఏ పీవో అభిషేక్

సాక్షి, పాడేరు: పెదబయలు మండలం కిముడుపల్లి పంచాయతీ, గడుగుపల్లిలో విద్యుత్ షాక్‌తో తల్లీబిడ్డలు ముగ్గురు మృతిచెందిన సంఘటనపై కలెక్టర్ దినేష్‌కుమార్ రూ.3లక్షల తక్షణ సాయం మంజూరు చేశారు. కొర్రా మోహన్‌రావు భార్య లక్ష్మి, కుమారుడు సంతోష్, కుమార్తె అంజలి విద్యుత్ ప్రమాదంలో మృతిచెందడం తెలిసిందే. విషాదంలో ఉన్న మోహన్‌రావును మంగళవారం జాయింట్ కలెక్ట డాక్టర్ అభిషేక్ గౌడ, ఐటీడీఏ పీవో అభిషేక్ మంగళవారం పరామర్శించారు. తక్షణ సాయంగా మంజూరైన రూ.3 లక్షల చెక్కును బాధితునికి అందజేశారు. సీఎం సహాయనిధి నుంచి మృతులు ఒకొక్కరికి రూ.5 లక్షల చొప్పున మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని, తక్షణ సాయం కింద రూ.3 లక్షలు అందజేశామని, మిగతా మొత్తం రూ.12 లక్షలు విడుదలైన తరువాత పంపిణీ చేస్తామని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో కె.పద్మలత, పెదబయలు తహసీల్దార్ రంగారావు పాల్గొన్నారు.

తల్లీబిడ్డల మృతి బాధాకరం: అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

విద్యుత్ షాక్‌తో తల్లీబిడ్డలు కొర్ర లక్ష్మి, సంతోష్, అంజలి మృతిచెందడం బాధాకరమని అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న ఆయన మంగళవారం పాడేరులోని జిల్లా సర్వజన ఆస్పత్రికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. శవ పరీక్షల గదిలో మృతదేహాలను ఆయన పరిశీలించారు. బాధితుడు కొర్రా మోహన్‌రావును పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం నుంచి బాధిత కుటుంబానికి అన్ని విధాల సాయం అందేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి సత్వర న్యాయం చేయాలని, పెద్ద మొత్తంలో నష్ట పరిహారం చెల్లించి, పక్కాగృహం నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వా మిత్ర, కిముడుపల్లి సర్పంచ్ శోభారాణి పాల్గొన్నారు.

మృతదేహాలకు అంత్యక్రియలు

పెదబయలు: తల్లీబిడ్డలు కొర్రా లక్ష్మి,సంతోష్,అంజలి మృతదేహాలకు మంగళవారం పాడేరు జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు. గడుగుపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు.

క్లుప్తంగా

వేంపాడు వద్ద కారు బోల్తా



వేంపాడు వద్ద బోల్తా పడిన కారు

నక్కపల్లి: జాతీయ రహదారిపై వేంపాడు జంక్షన్ సమీపంలో కారు బోల్తా పడింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డారు. మంగళవారం రాజమండ్రి నుంచి విశాఖ వెళ్తున్న కారు ముందు వెళ్తున్న లారీని తప్పించబోయి డివైడర్‌ను ఢీకొట్టి అవతల మార్గంలోకి వచ్చి బోల్తా పడింది. ఆ సమయంలో కారులో నలుగురు ఉన్నారు. అదృష్టవశాత్తూ వారెవరికి ఎటువంటి గాయాలు కాలేదు.

పలు రైళ్లు రద్దు



తాటిచెట్లపాలెం: విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న భద్రతా పనుల నిమిత్తం పలు రైళ్లను దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.దిగువ రైళ్లు ఆయా తేదీల్లో రెగ్యులర్ మార్గంలో కాకుండా మళ్లించిన మార్గంలో వయా నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా నడుస్తాయి.

హౌరా-ఎస్ఎంవీటీ బెంగళూరు (12863)ఎక్స్‌ప్రెస్ 11,13,14,16,17,20,21, 23,24వ తేదీల్లో, ధన్‌బాద్-అలెప్పీ(13351) బొకారో ఎక్స్‌ప్రెస్ ఈ నెల 16,17,20, 21,23,24వ తేదీల్లో, హతియా-ఎర్నాకులం (22837) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 16,23వ తేదీల్లో, హతియా-ఎస్ఎంవీటీ బెంగళూరు (12835) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 17,24వ తేదీలలో, టాటా నగర్-ఎస్ఎంవీటీ బెంగళూరు (12889) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 20వ తేదీన, హతియా-ఎస్ఎంవీటీ బెంగళూరు(18637) ఎక్స్‌ప్రెస్ ఈ నెల21న, ముంబయి సీఎస్‌టీఎం-భువనేశ్వర్ (11019)కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 13,14, 25,27,28,30వ తేదీల్లో, గుంటూరు-విశాఖ (17239) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 26,28, 29,31వ తేదీల్లో మళ్లించిన మార్గంలో నడుస్తాయి.

అధికారులు బాధ్యతలను విస్మరించొద్దు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, వేదికపై ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

- ప్రొటోకాల్ ఉల్లంఘన తగదు
- పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

కొయ్యూరు: ప్రొటోకాల్‌ను విస్మరించి ప్రజలు తిరస్కరించిన వారిని అందలం ఎక్కించాలని చూసే అధికారులు ఇబ్బందులు పడతారని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు హెచ్చరించారు. ప్రజలు తిరస్కరించిన వారు ప్రొటోకాల్‌కు అనర్హులనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. మండల కేంద్రంలో ఎంపీపీ బి.రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన మండల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరుగా ప్రజల ద్వారా ఎన్నుకోకుండా, నామినేటెడ్ పోస్టులు లేకుండా కనీసం వార్డు సభ్యులు కూడా కాని వారికి ప్రొటోకాల్ ఎలా వర్తిస్తోందని ప్రశ్నించారు. పంచాయతీల్లో సర్పంచ్‌ల తీర్మానాలు తీసుకుని వారి ఆధ్వర్యంలో పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయాల్సిన అధికారులు బాధ్యతలను విస్మరించి ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు.

రైతులను విస్మరించిన కూటమి ప్రభుత్వం

మండలంలోని సింగవరం రైతు సేవా కేంద్రం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు మంగళవారం ఎంపీపీ రమేష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులను విస్మరించిందన్నారు. రైతుల నుంచి అన్ని రకాల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని, గిట్టుబాటు ధర విధిగా కల్పించాలన్నారు. ఆలస్యంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో చాలా మంది రైతులు తక్కువ ధరకు ధాన్యం అమ్మకాలు చేయాల్సి వచ్చిందన్నారు.

రైతు సమస్యలపై 13న ఆందోళన

రైతు సమస్యలపై కలెక్టరేట్ వద్ద ఈనెల 13న నిర్వహిస్తున్న ఆందోళన కార్యక్రమం పోస్టర్‌ను పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు తదితరులు ఆవిష్కరించారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని, ఈ-క్రాప్‌ను సకాలంలో నమోదు చేయాలని, ఉచిత పంటల బీమా పూర్తిగా అందజేయాలని డిమాండ్ చేస్తామన్నారు. జెడ్పీటీసీ వారా నూకరాజు, వైస్ ఎంపీపీలు అంబటి నూకాలు, అప్పన వెంకటరమణ, ఎంపీడీవో ప్రసాద్, ఏవో ఉమాదేవి, తహసీల్దార్ ప్రసాద్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, నాయకులు

వైద్య చికిత్సలు అందక గర్భస్థ శిశువు మృతి

అంబులెన్స్ సమకూర్చక అద్దె కారులో కేజీహెచ్‌కు బాధితురాలి తరలింపు



గర్భిణిని తరలించేందుకు కుటుంబ సభ్యులు సిద్ధం చేసుకున్న కారు

పాడేరు: స్థానిక జిల్లా ఆస్పత్రి మాతా, శిశు విభాగంలో గర్భిణికి సకాలంలో వైద్య చికిత్సలు అందక గర్భంలో ఐదు నెలల శిశువు మృతి చెందిందని ఆమె తండ్రి సింహాచలం, కుటుంబ సభ్యులు ఆరోపించారు. పట్టణంలోని గుడివాడ వీధికి చెందిన సాసుమెల్లి నీలకంఠేశ్వరికి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో స్థానిక జిల్లా ఆస్పత్రి మాతా, శిశు విభాగానికి తీసుకువచ్చారు. ఇక్కడ సకాలంలో వైద్య చికిత్సలు కల్పించకపోవడంతో కడుపులో ఉన్న ఐదు నెలల శిశువు మృతి చెందిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నీలకంఠేశ్వరి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని అత్యవసరంగా కేజీహెచ్‌కు వెళ్లాలని వైద్యులు సూచించారని, కానీ సకాలంలో అంబులెన్స్ ఏర్పాటు చేయలేదన్నారు. పలు మార్లు తాము వైద్య సిబ్బందిని అంబులెన్స్ ఏర్పాటు చేయాలని కోరినా ప్రస్తుతానికి సిద్ధంగా లేవని సమాధానమిచ్చారని ఆరోపించారు. ఆమె పరిస్థితి విషమంగా మారడంతో ఇక చేసేది లేక అద్దె కారులో విశాఖపట్నం తరలించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వమిత్రను వివరణ కోరగా విద్యుత్ షాక్ ఘటన మృతదేహాల పోస్టుమార్టం చేయించే ప్రక్రియలో తాను ఉన్నానని, తన దృష్టికి ఎవ్వరూ తీసుకురాలేదన్నారు. ఈ విషయంపై పూర్తి స్థాయిలో ఆరా తీస్తానని చెప్పారు.

రాళ్ల కుప్పలను తొలగించాలి

కొయ్యూరు: పిట్టచలంలో జాతీయ రహదారిపై వేసిన రాళ్ల కుప్పను తొలగించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని రావణాపల్లి ఎంపీటీసీ సత్యవేణి, సీపీఐ మండల కార్యదర్శి ఇరువాడ దేముడు ఆందోళన చేశారు. పిట్టచలం గ్రామంలో వారు మంగళవారం పర్యటించారు. అక్కడి జాతీయ రహదారిపై పేరుకున్న రాళ్ల కుప్పల వల్ల జరగనున్న ప్రమాదాలపై ఆందోళన వ్యక్తం చేశారు. రోజులు గడుస్తున్నా వాటిని తొలగించకపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వెంటనే తొలగించాలని కోరారు.

కాఫీ సాగు విస్తీర్ణం పెంచేందుకు చర్యలు



గిరిజన రైతులతో మాట్లాడుతున్న పాడేరు కాఫీ బోర్డు ఎస్ఎల్‌వో రమేష్

ముంచంగిపుట్టు: గిరిజన గ్రామాల్లో కాఫీ సాగు విస్తీర్ణం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని పాడేరు ఐటీడీఏ కాఫీ బోర్డు ఎస్ఎల్‌వో సామర్ల రమేష్ అన్నారు. మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ జభడ గ్రామంలో మంగళవారం పాడేరు కాఫీ బోర్డు ఆధ్వర్యంలో గిరిజన రైతులతో కాఫీ సాగు, లాభాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాఫీ సాగు వల్ల కలిగే ప్రయోజనాలు, సాగులో పాటించాల్సిన జాగ్రత్తలను రైతులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక లాభాలు వచ్చే కాఫీ సాగుపై గిరిజన రైతులు దృష్టి పెట్టాలన్నారు. కాఫీ సాగుకు ఐటీడీఏ అందిస్తున్న సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాఫీ పండ్లు కిలో రూ.44, పార్చ్‌మెంట్ కిలో రూ.285, చెర్రీ కాఫీ కిలో రూ.150ల చొప్పున కొనుగోలు చేస్తామన్నారు. మండలంలో 170 కాఫీ కల్లాలు, 10 పల్పర్ మిషన్లు మంజూరయ్యాయని, వాటికి సంబంధించిన దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, త్వరలో పంపిణీ చేస్తామన్నారు. కాఫీ రైతులకు ఐటిడిఏ ద్వారా అందించే రాయితీలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఆయన కోరారు. కాఫీ లైజన్ వర్కర్లు ఈశ్వర్‌రావు, జగన్నాథం, రఘుపతి గిరిజన రైతులు పాల్గొన్నారు.

చట్రాపల్లి బాధితులకు ఆర్థిక సాయం


సేకరించిన విరాళాల మొత్తాన్ని అందజేసిన వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి బాలరాజు



చట్రాపల్లిలో బాధిత గిరిజనులకు విరాళాల మొత్తాన్ని అందజేస్తున్న మాజీ మంత్రి బాలరాజు

గూడెంకొత్తవీధి: ప్రకృతి విపత్తు కారణంగా సర్వం కోల్పోయిన మండలంలోని చట్రాపల్లి గిరిజనులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన చట్రాపల్లి గ్రామాన్ని సందర్శించారు. బాధితుల తరపున చింతపల్లిలో ఆయన సేకరించిన రూ.55 వేలను ప్రాణనష్టంతోపాటు, ఇళ్లు కోల్పోయిన మొత్తం 37 కుటుంబాలకు అందజేశారు. ప్రభుత్వం సత్వరమే ఇళ్లను నిర్మించి వారిని అన్నివిధాలుగా ఆదుకోవాలని ఆయన కోరారు.బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో గాలికొండ పంచాయతీ సర్పంచ్ బుజ్జిబాబు, ఎంపీటీసీ బుజ్జిబాబు స్థానికులు చంద్రరావు, చిన్న, కోఆప్షన్‌సభ్యులు దావూద్ తదితరులు పాల్గొన్నారు.

తగ్గుముఖం పడుతున్న ఉష్ణోగ్రతలు



పాడేరులో కురుస్తున్న పొగమంచు

వణికిస్తున్న చలిగాలులు





లంబసింగిలో దట్టంగా కురుస్తున్న మంచు

చింతపల్లి: మన్యంలో మళ్లీ కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. మంచు దట్టంగా కురవడమే కాకుండా చలిగాలుల ప్రభావం పెరుగుతోంది. మంగళవారం జి.మాడుగులలో 13.5 డిగ్రీలు, చింతపల్లిలో 15.4 డిగ్రీలు నమోదు అయినట్లు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. పాడేరు డివిజన్ పరిధిలో అనంతగిరి, అరకులోయలో 15.8 డిగ్రీలు, డుంబ్రిగుడలో 16.1, గూడెంకొత్తవీధిలో 16.2 డిగ్రీలు, హుకుంపేటలో 16.3, పెదబయలులో 16.6 ,ముంచంగిపుట్టులో 16.9, కొయ్యూరులో 13.3 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయినట్లు ఆయన పేర్కొన్నారు.

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో పొగమంచు దట్టంగా కురుస్తోంది. అరకులోయ కేంద్ర కాఫీబోర్డు వద్ద 16డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరులో 17డిగ్రీలు నమోదయ్యాయి. చలిగాలుల తీవ్రత నెలకొంది.

ఏపీఎస్ఆర్‌టీసీలో కారుణ్య నియామకాలు

డాబాగార్డెన్స్: ఉమ్మడి విశాఖ జిల్లాలో సర్వీసులో ఉంటూ మృతి చెందిన ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు మంగళవారం తన చాంబర్ కారుణ్య నియామకాలను నిర్వహించారు. 19 మందిలో 17 మందికి కండక్టర్లగా, ఇద్దరికి అసిస్టెంట్ మెకానిక్‌లు నియామక ఆర్డర్లు అందజేశారు. మిగిలిన వారికి త్వరలో ఉద్యోగాలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తామన్నారు.

పెందుర్తిలో దోపిడీ దొంగల బీభత్సం

- జీవీఎంసీ పంప్ ఆపరేటర్‌పై కత్తులతో దాడి
- నగదు అపహరణ
- కరకవానిపాలెం సమీపంలో ఘటన



గాయాలతో చికిత్స అనంతరం బాధితుడు మళ్ల జనార్దన్



ఘటనాస్థలిని పరిశీలిస్తున్న క్రైం విభాగం పోలీసులు

పెందుర్తి: నగర శివారు పెందుర్తిలో మరోసారి దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించారు. ఆనందపురం-అనకాపల్లి జాతీయ రహదారిపై కరకవానిపాలెం సమీపంలో మంగళవారం తెల్లవారు జామున ముగ్గురు దుండగులు ఓ యువకుడ్ని అడ్డగించి కత్తులతో దాడి చేశారు. అతడి వద్ద ఉన్న రూ.10 వేలు అపహరించుకుపోయారు. వివరాలివి..పెందుర్తి మండలం గవరపాలెనికి చెందిన మళ్ల జనార్దన్ జీవీఎంసీ 96వ వార్డు నీటి సరఫరా విభాగంలో పంప్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం విధులకు హాజరయ్యేందుకు తన ఆటోలో ఇంటి నుంచి పెందుర్తి బయలుదేరాడు. కరకవానిపాలెం రోడ్డు నుంచి జాతీయ రహదారి పైకి వస్తున్న సమయంలో ముగ్గురు దుండగులు మంకీ క్యాప్‌లు ధరించి, చేతికి గ్లౌజ్‌లు వేసుకుని కత్తులతో ఆటోను అడ్డగించారు. ఇద్దరు దుండగులు జనార్దన్‌కు చెరోపక్కా కూర్చొని నగదు కోసం వెతికారు. అయితే జనార్దన్ ప్రతిఘటించడంతో క్షణాల్లో దుండగులు కత్తులతో రెండు చేతులపై దాడి చేశారు. జేబులో ఉన్న రూ.10 వేలు లాక్కున్నారు. అదే సమయంలో వెనుక కూర్చున్న వ్యక్తి జనార్దన్ వీపుపై గాయపరిచారు. ఆ తరువాత జాతీయ రహదారి మీదుగా సరిపల్లి వైపు పారిపోయారు. దాడి సమయంలో దుండుగులు పూటుగా మద్యం సేవించి ఉన్నట్లు తెలుస్తోంది. దాడి నుంచి కోలుకున్న బాధితుడు వెంటనే గ్రామపెద్దలకు, పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనాస్థలికి చేరుకున్న పెందుర్తి క్రైం విభాగం పోలీసులు ప్రాథమిక విచారణ చేపట్టారు. గాయపడిన జనార్దన్‌ను ఆస్పత్రిలో చేర్పించారు. దుండగుల కోసం నాలుగు బృందాలు విస్తృతంగా గాలిస్తున్నట్లు క్రైం విభాగం సబ్ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు తెలిపారు.

వరుస ఘటనలతో వణుకు

సరిగ్గా వారం రోజుల క్రితం పెందుర్తి మండలం పినగాడిలో రోడ్డుకు ఆనుకుని ఉన్న ఇంటికి బైక్‌లపై వచ్చిన నలుగురు దుండగులు ఓ మహిళను బెదిరించి రూ.5 లక్షలు, 8 తులాల బంగారం దోచుకుపోయిన సంగతి తెలిసిందే. సరిగ్గా అదే తరహాలో దారి కాసిన దుండగులు జనార్దన్‌పై దాడి చేసి దోపిడీ చేసిన తీరు క్రైం సినిమాను తలపించింది. మరోవైపు వరుసగా ఇంటి దొంగతనాలు కూడా జరుగుతుండడంతో పెందుర్తి పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

వరి కోతకు ముందు జనుములు విత్తడం మేలు

అనకాపల్లి: వరి చేను కోసే రెండు, మూడు రోజుల ముందు పొలంలోని తేమను వినియోగించుకుని జనుము విత్తనాలు చల్లుకుంటే లాభదాయకంగా ఉంటుందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు తెలిపారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రబీలో వరి సాగు కోసం నారుమడి వేసుకోవచ్చని, ఎకరానికి 20-25 కిలోల వరి విత్తనం సరిపోతుందన్నారు. దుక్కిలో 5 సెంట్ల నారుమడికి 2.2 కిలోల యూరియా, 6.25 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 1.6 కిలోల మ్యురేట్ ఆఫ్ పొటాష్‌ను వేసుకోవాలని ఆయన సూచించారు. నారుమడి వేసిన 4-7 రోజులప్పుడు కలుపు నివారణకు పైరజోసల్ఫ్యూరాన్ ఇథైల్ కలుపు మందును ఎకరానికి 100 గ్రాముల చొప్పున 25 కిలోల ఇసుకలో కలిపి చల్లుకోవాలన్నారు. రబీలో రాగి వేసే రైతులు ఎకరానికి 2.5 కిలోల విత్తనం చొప్పున చల్లుకోవాలని, విత్తే ముందు కిలో విత్తనానికి 2 గ్రా. కార్బెండజిం లేదా 3 గ్రా. మాంకోజెబ్ మందుతో కలిపి విత్తన శుద్ధి చేయాలన్నారు. 5 సెంట్ల నారుమడికి 1.5 కిలోల యూరియా, 4 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 1.0 కిలో మ్యురేట్ ఆఫ్ పొటాష్‌ను వేసుకోవాలన్నారు. చెరకు మొక్క తోటకంటే ముందుగా కార్శి తోటలను నరుకుకోవాలని, బెల్లం చేసుకునే రైతులు పంచదార శాతం క్రింది కణుపులలో ఎక్కువగా ఉంటుందని, కాబట్టి చెరకును నేలకు దగ్గరగా నరకాలని సూచించారు. చెరకు నరకిన 24 గంటలలో బెల్లం ఆడుకోవాలని ఆయన చెప్పారు. ఒకటి లేదా రెండు తడులు పెట్టే వీలున్నట్లయితే వరి మాగాణుల్లో అపరాలు వేసుకోవచ్చని, కాప్టన్ 2.5 గ్రా. ఇమిడాక్లోప్రిడ్ 5 మీ.లీ విత్తనానికి చొప్పున కలిపి విత్తన శుద్ధి చేయాలన్నారు. తరువాత విత్తనాన్ని నీడలో అరబెట్టి ఎకరాకు సరిపడే విత్తనాన్ని 200 గ్రా.ల రైజోబియం కల్చరును విత్తే గంట ముందు విత్తనానికి పట్టించి విత్తుకోవాలని ఆయన పేర్కొన్నారు.

కేజీహెచ్‌లో మహిళకు అరుదైన చికిత్స

మహారాణిపేట: కేజీహెచ్‌లో ఓ మహిళకు అరుదైన శస్త్ర చికిత్స చేశారు. బాధిత మహిళ కోలుకోవడంతో డిశ్చార్జ్ చేశారు. వైద్యులను సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ అభినందించారు. ఒడిశాకు చెందిన లబ్బూరు గ్రామ నివాసి సంధ్యకు 19 ఏళ్లగా పొట్టలో గడ్డ ఉంది. నిత్యం కడుపు నొప్పితో బాధపడేది. గత నెల 20న కేజీహెచ్ గైనిక్ ఓపీలో వైద్యులకు చూపించారు. వైద్యులు స్కాన్ చేయగా పొట్టలో కణితి ఉందని నిర్ధారించారు. దీంతో గైనిక్ విభాగంలో శస్త్ర చికిత్స నిర్వహించారు. పెద్ద అండాశయ కణంలో ఆపరేషన్ చేసిన రెండు రోజుల తర్వాత రోగికి జ్వరం వచ్చి బీపీ డౌన్ అయింది. వెంటనే ఐసీయూకి తరలించారు. అక్కడ డాక్టర్ల బృందం పరీక్షించారు. ఐసీయూలో నాలుగు రోజుల పాటు ఆమెకు వైద్య సేవలు అందించి తర్వాత గైనిక్ వార్డుకు తరలించారు. బాధిత మహిళ ఆరోగ్యంగా ఉండడంతో సోమవారం సాయంత్రం డిశ్చార్జి చేశారు. వైద్యులు వాణి, సుధా పద్మశ్రీ, కవిత, దేవి, కళ్యాణి, రవి, డీసీఎస్ఆర్ఎంవో డాక్టర్ మెహర్ కుమార్ పాల్గొన్నారు.

వైకల్యాన్ని జయించి.. విజేతలుగా నిలిచి

సందడిగా విభిన్న ప్రతిభావంతుల క్రీడా పోటీలు



డిస్కస్ త్రో విభిన్న ప్రతిభావంతురాలు



చదరంగంలో ఎత్తుకు పైఎత్తులు వేస్తున్న విభిన్న ప్రతిభావంతులు

విశాఖ స్పోర్ట్స్: సంకల్ప బలం ముందు కష్టాలన్నీ అల్పమేనని నిరూపించారు..సాధించాలన్న తపన, పట్టుదల ఉంటే అంగవైకల్యం విజయానికి అడ్డుకాదని స్పష్టం చేశారు. వైకల్యం శరీరానికే గానీ..మనసుకు కాదని చాటి చెప్పారు. ఒకరికొకరు పోటీ పడుతూ స్ఫూర్తి చాటుకున్నారు విభిన్న ప్రతిభావంతులు. పోలీసు బారెక్స్ గ్రౌండ్స్‌లో విభిన్నప్రతిభావంతులకు పోటీలు నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో డిజేబుల్ వెల్ఫేర్ శాఖ సహకారంతో పోటీలు నిర్వహించారు. దాదాపు 15 కేటగిరీల్లో మానసిక, శారీరక విభిన్న ప్రతిభావంతులు పోటీపడ్డారు. టీ 11,12,13 కేటగిరీల్లో త్రో అంశాల్లో పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఫీల్డ్‌లో సైతం పలు కేటగిరీలుగా నిర్వహించిన పోటీల్లోనూ సత్తాచాటారు. అథ్లెటిక్స్‌తో పాటు చదరంగం పోటీలను నిర్వహించారు. మెన్, వుమెన్‌కు వంద మీటర్ల పరుగు, డిస్కస్, షాట్‌పుట్ త్రోలోనూ పోటీలను నిర్వహించారు. విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిజేబుల్ వెల్ఫేర్ శాఖ ఏడీ మాధవి, సబ్ డివిజనల్ ఫారెస్ట్ అధికారిణి శ్రీవాణి పాల్గొనగా డీఎస్‌డీవో జూన్ గాలియట్, అథ్లెటిక్ కోచ్ వైకుంఠం, డీఎస్ఏ కోచ్‌లు సహకారం అందించారు.

249 రోజుల్లోనే మైలురాయి



సమావేశంలో మాట్లాడుతున్న వీపీఏ చైర్‌పర్సన్ అంగముత్తు

- 55 ఎంఎంటీ సరుకు నిర్వహణతో రికార్డు
- పోర్టు చైర్‌పర్సన్ ఎం.అంగముత్తు వెల్లడి

విశాఖ సిటీ: విశాఖ పోర్టు అథారిటీ(వీపీఏ) 2024-25 ఆర్థిక సంవత్సరానికి 90 మిలియన్ మెట్రిక్ టన్నుల (ఎంఎంటీ) సరుకు నిర్వహణ లక్ష్యంతో నిరంతరం శ్రమిస్తూ.. 249 రోజుల్లోనే 55 ఎంఎంటీ నిర్వహించి గత చరిత్రను తిరగరాసినట్లు వీపీఏ చైర్‌పర్సన్ డాక్టర్ ఎం.అంగముత్తు వెల్లడించారు. మంగళవారం నగరంలోని ఓ హోటల్‌లో భాగస్వాముల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది పోర్ట్ అత్యధికంగా 81.09 ఎంఎంటీ సరకు నిర్వహణ చేసి పాత రికార్డులను తిరగరాసిందని తెలిపారు. ఆ రికార్డును చెరిపేసి ఈ ఏడాది నూతన మైలురాయిని సాధించేందుకు భాగస్వాముల సహకారం అవసరమన్నారు. రాష్ట్ర, జిల్లా అధికారులు, రైల్వే, కస్టమ్స్, ఎన్‌హెచ్ఏఐ వంటి పీఎస్‌యూల సహకారాన్ని ప్రశంసించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రాధాన్యతలకు అనుకూలంగా మారీటైమ్ ఇండియా విజన్ 2047, ముఖ్యమంత్రి స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యాలకు అనుగుణంగా పోర్ట్ ఆధారిత అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్టు వివరించారు. ఫిబ్రవరి 2025 నాటికి పూర్తయ్యే మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో భాగస్వాముల సూచనలను ఆహ్వానించారు. అనంతరం జిల్లా కలెక్టర్ హరేంధ్ర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్‌లు విశాఖలో పచ్చదనం, నగర సుందరీకరణకు పోర్ట్ చైర్‌పర్సన్, వారి బృందం చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎస్ఎల్ సీఎండీ హేమంత్ కత్రి, కస్టమ్స్, జీఎస్టీ ప్రధాన కమిషనర్ నరసింహ శ్రీధర్, ఐటీ చీఫ్ కమిషనర్ జి.కె.ధాల్ పాల్గొన్నారు.

12 కేజీల గంజాయితో ఐదుగురి అరెస్ట్

అనకాపల్లి: ఏఎస్ఆర్ జిల్లా హుకుంపేట మండలం నుంచి అనకాపల్లికి గంజాయిని ఆటోలో తరలిస్తుండగా స్థానిక గుండాల జంక్షన్ వద్ద మంగళవారం ఐదుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టణ సీఐ విజయకుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అజ్ఞాత వ్యక్తులు ఇచ్చిన సమాచారం మేరకు వాహనాల తనిఖీ చేస్తుండగా ఆటోలో 12 కేజీల గంజాయిని గుర్తించారు. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన అరవింద్ కుమార్, సంజీవన్ మోహన్‌రాజ్ ఆటోలో వస్తుండగా.. వారికి దారి చూపిస్తూ హుకుంపేట మండలం, కేయూకు చెందిన పాంగి కేశవరావు, సీదరి గాసన్న, సిదిరి మురళి బైక్‌పై అనుసరిస్తున్నారని సీఐ చెప్పారు. ఈ మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.